బాలమిత్ర , ఆగష్టు – 1991, పుట : 10-12, జి. రామలక్ష్మి - హైదరాబాదు

## అసలుకే ఎసరు

రాజయ్య రామయ్య ఇరుగు పొరుగువాళ్ళు! అయినా వాళ్ళిద్దరి మధ్య పచ్చగడ్డేస్తే భగ్గుమంటుంది. రామయ్య రెక్కల కష్టంతో బాగా ఆర్జించి చాలా గొప్పవాడయి, ఇల్లూ, వాకిలీ, పొలం - పుట్రా చూస్తుండగానే సంపాదించేసాడు. బద్ధకస్తుడయిన రాజయ్య 'ఎక్కడేసిన గొంగళి అక్కడే' అన్నట్లు ఉన్నాడు. తన బద్ధకాన్ని గురించి తాను తిట్టుకోలేక సమర్థతతో ఆర్జించుకుని, గొప్పవాడయిన రామయ్యను చూసి కుళ్ళిపోసాగాడు.

ఒకసారి తన మామగారికి సుస్తీ చేసిందని భార్యా, ఇద్దరు కొడుకులను వెంటబెట్టుకుని బయలుదేరుతూ, రామయ్య యింటికి వచ్చి, ''రామయ్యా, మా మామకు సుస్తీ చేసిందట! మేము అర్జంటుగా ఊరెళ్ళి వస్తాము. అసలే ఈ వూళ్ళో దొంగల భయం ఎక్కువగా ఉంది. కాబట్టి, ఈ గొలుసు, ఉంగరం వెయ్యి రూపాయల నగదు నీ దగ్గర దాచుకుందామని వచ్చాను. దయ ఉంచి యివి ఉంచు నీ దగ్గర, వచ్చి తీసుకుంటాను!'' అన్నాడు.

''దానిదేముందిలే రాజయ్యా, వెళ్ళిరా! వచ్చాక నీ నగలు, డబ్బు తీసుకుందువుగాని! నా సొమ్ముకన్నా పదిలంగా నీ సొమ్ము దాచి ఉంచి, రాగానే నీవి నీకు యిచ్చేస్తాను!'' అన్నాడు.

రాజయ్య ఊరు వెళ్ళి ఓ పది రోజుల తర్వాత వచ్చాడు. వస్తూనే తన సొమ్ము, డబ్బు యిమ్మని అడిగి తీసుకుని, ''ఇదేమిటి వెయ్యి రూపాయలే యిచ్చావు! నేనిచ్చినది మూడు వేలు కదా! మిగతా రెండు వేలు ఏవి?'' అని అడిగాడు. దానికి రామయ్య ఆశ్చర్యపోయి, కంగారుపడుతూ, ''మర్చిపోయావా రాజయ్యా, నీవు ఒక గొలుసు ఒక ఉంగరం, వెయ్యి రూపాయల నగదు మాత్రమే నా వద్ద ఉంచి వెళ్ళావు. ఇప్పుడు మాట మార్చి మూడు వేలంటే, నేనెక్కడి నుంచి తెచ్చివ్వగలను?'' అన్నాడు.

''చాలు చాల్లేవయ్యా.... మూడు వేలకు ఒక వెయ్యి చేతిలో పెట్టి బుకాయిస్తున్నావు. నాకు గానీ వళ్ళు మండిరదంటే, న్యాయాధికారి దగ్గరకు లాక్కెళ్ళుతా, జాగ్రత్త!'' గదమాయించాడు రాజయ్య.

అప్పటిదాకా అంతా విన్న రామయ్య కొడుకు, ''ఏందయ్యా, అప్పటి నుంచి చూస్తున్నా నీవాలకం? వెయ్యి దాచి మూడు వేలంటూ బుకాయిస్తున్నావే?'' అంటూ గబుక్కున అతని చేతిలో తన తండ్రి ఉంచిన

వెయ్యి, గొలుసు, ఉంగరం కూడా లాక్కుని, ''పో అసులు నువేమీ మా దగ్గర దాచలేదు. నీకు దిక్కున్న చోటికి పోయి చెప్పుకో!'' అన్నాడు రాజయ్య.

''ఓరి నాయనో, ఓలమ్మో'' అనుకుంటూ న్యాయాధికారి యింటికి పరుగెత్తి అంతా చెప్పుకుని, లబోదిబో మంటూ మొత్తుకున్నాడు.

అంతా విని న్యాయాధికారి రామయ్యని, అతని కొడుకుని తక్షణం పిలిపించాడు.

''ఏమిటి రామయ్యా, రాజయ్య చెప్పిందంతా నిజమేనా?'' అని అడిగాడు పది మందిలో నిలదీసి.

''రామ రామ, అసలు అతను మా యింటికే రాలేదండీ! అలాంటిది అది నా దగ్గర దాచాడంటే మీరు మాత్రం ఎలా నమ్ముతున్నారండీ?'' అని అన్నాడు రామయ్య.

రాజయ్య, 'మొదటికే మోసం వచ్చిందన్న సంగతి గ్రహించి, వీళ్ళిద్దరూ నన్ను మోసం చేస్తున్నారు; ఉంగరం, గొలుసు, వెయ్యి, కాదు - కాదు మూడువేలు దాచానండీ రామయ్య దగ్గర!'' అన్నాడు కంగారుగా తొట్రుపాటు పడుతూ.

''చూసారుగా కంగారులోనయినా వెయ్యి అన్న పదం కక్కాడురాజయ్య. నిజం అతని చేతే ఒప్పించండి!'' అన్నారు తండ్రి కొడుకులిద్దరూ.

''న్యాయాధికారి నన్న భయం - భక్తీ లేకుండా నిజం కప్పిపుచ్చి అబద్ధాలాడుతున్నందుకు ఆ వస్తువులు పోవటమే కాకుండా జైలు శిక్ష, నష్టపరిహారం విధిస్తాను, జాగ్రత్త! ఇప్పటికైనా నిజం చెప్పు!'' అన్నాడు న్యాయాధికారి.

''బాబ్బాబూ, నిజం చెప్తాను. రామయ్య చెప్పిందే నిజం! వెయ్యి రూపాయలే దాచి ఉంచి, మూడు వేలు అడిగాను. అతను నాకన్నా సిరిసంపదలతో ఎక్కువగా ఉండటం చూసి ఈర్ష్య కలిగి, అతన్ని దెబ్బకొట్టాలన్న దురుద్దేశ్యంతో అలా అబద్ధాలాడాను. దయ ఉంచి నా ఉంగరం, గొలుసు, వెయ్యి రూపాయలు ఇప్పించేయండి; నన్ను క్షమించండి. ఇంకెప్పుడూ యిలాంటి దుష్టమైన పనులు చేయను; ఎవరికి హాని తలపెట్టను!'' అన్నాడు.

''అయ్యా, నన్ను క్షమించండి! నా కొడుకు చెప్పిన ఉపాయంతో ఈ అపాయం తప్పించుకో గలిగాను. అత్యాశగా వున్న అతనికి అసలుకే ముప్పు పెడితే దారికొస్తాడని, నా కొడుకు నా కిచ్చిన ధైర్యం, సలహా మేరకు నేను కూడా రాజయ్య నా దగ్గర ఏమీ దాచలేదని ఆబద్ధమాడాను! కానీ మరే దురుద్దేశ్యంతో కాదు. ''అసలుకు

ఎసరు'' పెట్టేసరికి రాజయ్య దారికొచ్చి నిజం చెప్పాడు; కాబట్టీ మా యిద్దర్నీ క్షమించి, యివి రాజయ్యకిచ్చేయండి!'' అంటూ న్యాయాధికారికి వస్తువులూ, డబ్బూ ఇచ్చేసాడు రామయ్య.

''ఇప్పటికైనా ఇలాంటి పెధవ ఆలోచనలు, పెధవ పనులు తలపెట్టక జాగ్రత్తగా ఉండు. లోకంలో నీకన్నా తెలివైనవారు ఉండారని గ్రహించుకో!'' అంటూ హెచ్చరించి మందలించి పంపాడు న్యాయాధికారి రాజయ్యను. తండ్రీ కొడుకులిద్దరూ, న్యాయాధికారికి తమ కృతజ్ఞతలు తెలుపుకొని తమ ఇంటి దారిన తాము వెళ్ళిపోయారు.